క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11 కేవీ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరిసర ప్రాంతాలు, నీలకంఠేశ్వర ఆలయ పరిసరాలు, ఇందిరానగర్, ఎన్జీఓస్ కాలనీ, పోచమ్మ వీధి, ఉమాపార్థీవకోటిలింగాల ఆలయ పరిసరాలు, రూరల్ పోలీస్‌స్టేషన్ పరిసరాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ ఉండదని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఓటరుగా నమోదు చేసుకోండి



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకట్‌రెడ్డి

దుబ్బాక: ఈనెల 22వ తేదీ వరకు కొత్త ఓటర్ నమోదు, ఓటర్ జాబితాలో మార్పులకు, చేర్పులకు భారత ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని.. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దుబ్బాక తహసీల్దార్ వెంకట్‌రెడ్డి సూచించారు. బుధవారం దుబ్బాక ఐఓసీ కార్యాలయంలో పలు రాజకీయ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి 8న ఓటర్ తుది జాబితా విడుదల చేస్తామని.. 18 సంవత్సరాలు నిండి ఉండి ఇంకా ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోని వారు తప్పక దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సాజీద్, ఆర్ఐ నరసింహారెడ్డి, వివిధ పార్టీల రాజకీయ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్‌రూరల్: తెలంగాణ మైనార్టీ బాలుర గురుకుల విద్యాసంస్థలో 2024- 25 విద్యా సంవత్సరంలో వివిధ తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు గజ్వేల్ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. 5వ తరగతిలో విద్యనభ్యసించేందుకు మైనార్టీ విద్యార్థులకు మొదటి ప్రాధాన్యం ఉంటుందని, మిగిలిన సీట్లను ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీలకు డ్రా పద్ధతిన ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 18 నుంచి ఫిబ్రవరి 6 వరకు ఆన్‌లైన్‌లో సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

'కొమ్మూరి'పై విమర్శలు సరికాదు



మాట్లాడుతున్న చిరంజీవులు

చేర్యాల(సిద్దిపేట): సీపీఎం నాయకులు చౌకబారు విమర్శలు మానుకోవాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మంచాల చిరంజీవులు అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి మాట్లాడారు. జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డిపై సీపీఎం నాయకుడు ఆముదాల మల్లారెడ్డి చేస్తున్న విమర్శలు అర్థరహితమన్నారు. చేర్యాల పెద్ద చెరువు కట్ట సుందరీకరణ పనులు గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిలిచిపోయాయని తెలిపారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కుమ్మక్కై కొమ్మూరిపై విమర్శలు చేయడం మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సంజీవులు, మల్లేశం, ఉపేందర్, భాస్కర్, దామోదర్, బుచ్చిరాములు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కోదండరాంను కలిసిన నాయకులు



ప్రొఫెసర్ కోదండరాంను సన్మానిస్తున్న నాయకులు

వర్గల్(గజ్వేల్): వేములవాడకు వెళుతున్న టీజేఎస్ అధినేత ప్రొఫెసర్ కోదండరాంను బుధవారం వర్గల్ మండలం గౌరారం వద్ద జిల్లా టీజేఎస్ కన్వీనర్ నీరుడి స్వామి, యువజన కాంగ్రెస్ నాయకుడు అనిల్‌రెడ్డి, పొన్నాల కుమార్ తదితరులు కలిశారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ల సమస్యలను, సిబ్బంది సమస్యలను ప్రొఫెసర్ కోదండరాం దృష్టికి తీసుకెళ్లారు. పనిభారం, ప్రమోషన్లు, పదోన్నతులు తదితర అంశాలను వివరించారు. టెక్నికల్ అసిస్టెంట్ నవీన్‌గౌడ్ తదితరులు ఆయనను కలిసిన వారిలో ఉన్నారు.

'నిందితుడిపై చర్యలు తీసుకోండి'

చేర్యాల(సిద్దిపేట): ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విశ్వబ్రాహ్మణ జిల్లా యూత్ అధ్యక్షుడు తాటికొండ సదానందం డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. పోలీసుల ఎదుటే విగ్రహం ధ్వంసం చేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు.

చెప్పుకోలేని వ్యథ..!

- టాయిలెట్లు లేక విద్యార్థుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



అసంపూర్తిగా వదిలేసిన మరుగుదొడ్డి నిర్మాణం

తొగుట(దుబ్బాక): ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వం వెరసి విద్యార్థులకు శాపంగా మారింది. మండలంలోని ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టాయిలెట్లు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పాఠశాలలో 151 మంది విద్యార్థులు ఉండగా అందులో బాలికలు 68 మంది, బాలురు 83 మంది విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు సరిపడా టాయిలెట్లు లేకపోవడంతో గతంలో ప్రభుత్వం వీటి నిర్మాణం కోసం రూ.6 లక్షలు మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ పనులు పూర్తిచేయకుండా వదిలేశాడు. దీంతో పాఠశాల సమీపంలోని ఓ పాడుబడిన భవనంలోకి బాలికలు టాయిలెట్‌కు వెళ్తున్నారు. మరుగుదొడ్డికి వెళ్లాలంటే ఇంటికి పరుగెత్తాల్సిన పరిస్థితి నెలకొంది. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకుండా పోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి టాయిలెట్ల నిర్మాణం పూర్తిచేసి విద్యార్థుల ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



టాయిలెట్‌కు వెళ్లాలంటే పాఠశాల సమీపంలోని పాడుబడిన భవనంలోకి వెళ్తున్నాం. అందులో తరచూ పాములు కనిపిస్తున్నా వెళ్లక తప్పడం లేదు. కొన్నిసార్లు మా ఉపాధ్యాయులు కాపలా ఉంటున్నారు. టాయిలెట్ల నిర్మాణం త్వరగా పూర్తిచేసి మా తిప్పలు తప్పించాలి.

– నిక్షిత, 7వ తరగతి, ఎల్లారెడ్డిపేట

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా..

టాయిలెట్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్లా. అయినప్పటికీ నిర్మాణ పనులు పూర్తి కాలేదు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.

– యాదవరెడ్డి, ఎంఈఓ, తొగుట



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

అపూర్వ సమ్మేళనం

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గౌరవెల్లి జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 1998- 99 బ్యాచ్ ఏడో తరగతి పూర్వ విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఉపాధ్యాయులను సన్మానించి నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏనుగు మల్లారెడ్డి, శంకుతల, నారాయణరెడ్డి, చంద్రారెడ్డి, లక్ష్మీనారాయణ, మోహన్‌రావు, దేవయ్య, రాజేశం, శంకర్, పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ



అక్షింతలతో భక్తులు

హుస్నాబాద్: పట్టణంలోని పలు వార్డుల్లో బుధవారం ఇంటింటికీ అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ చేశారు. అంతకుముందు ఎల్లంబజార్‌లోని హనుమాన్ దేవాలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు దొడ్డి శ్రీనివాస్, చిత్తారి పద్మ, జనగామ రత్న, వివిధ పార్టీల నాయకులు చిట్టి గోపాల్‌రెడ్డి, నీరుమల్ల శ్రీనివాస్, నర్సాగౌడ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్‌లు

మా పదవీ కాలం పెంచండి

అక్కన్నపేట(హుస్నాబాద్): సర్పంచ్‌ల పదవీకాలం పెంచాలని కోరుతూ పలువురు సర్పంచ్‌లు మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ కొప్పుల సత్యపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పదవీ బాధ్యతలు చేపట్టిన 8 నెలల తర్వాత చెక్‌పవర్ ఇచ్చారని గుర్తుచేశారు. అదేవిధంగా కరోనా కాలంలో దాదాపు రెండేళ్లు వృథాగా గడిసిపోయిందన్నారు. రాష్ట్ర ఆర్థిక అభివృద్ధి నిధులు 25 నెలలుగా.. కేంద్ర ఆర్థిక అభివృద్ధి నిధులు 14 నెలలుగా పంచాయతీలకు రావడం లేదని వివరించారు. అప్పులు తెచ్చి మరీ అభివృద్ధి పనులు చేశామని, కానీ బిల్లులు చాలా పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు అశోక్‌రెడ్డి, గద్దల రమేష్, గుడాల సంపత్, బానోత్ రవీందర్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు

బెజ్జంకి ఎంపీడీఓ రాము



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాము

హుస్నాబాద్‌రూరల్: గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులను గ్రామ సభల తీర్మానం మేరకు వినియోగించాలని.. అభివృద్ధి పనుల వివరాలను ఈ–స్వరాజ్ యాప్‌లో నమోదు చేయాలని బెజ్జంకి ఎంపీడీఓ దమ్మని రాము అన్నారు. బుధవారం హుస్నాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో మద్దూరు, అక్కన్నపేట, హుస్నాబాద్ మండలాల కంప్యూటర్ ఆపరేటర్లు, పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024- 25 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులను సద్వినియోగం చేయడానికి గ్రామస్థాయి నుంచే ప్రణాళికలను తయారు చేసుకొని వాటిని ఆన్‌లైన్ చేయించాలన్నారు. పంచాయతీ తీర్మాణాలు, నిధుల వ్యయం వివరాలను ఈ- స్వరాజ్ యాప్‌లో నమోదు చేసుకోవాలని చెప్పారు. కంప్యూటర్ ఆపరేటర్లు పంచాయతీ కార్యదర్శుల సహకారంతో ఆన్‌లైన్ చేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు రాఘవేంద్రరెడ్డి, సత్యాపాల్‌రెడ్డి, ఎంపీఓలు సురేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పంటలు ఎండిపోకుండా చూడండి



కొండపాక-తిమ్మారెడ్డిపల్లి శివారులో కాలువను పరిశీలిస్తున్న భూంరెడ్డి

కొండపాక(గజ్వేల్): యాసంగి సాగుకు నీటి ఇబ్బంది తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు భూంరెడ్డి కోరారు. తపాస్‌పల్లి నుంచి కొండపాక మండలంలోని పలు గ్రామాల్లోని చెరువులకు నీరు వచ్చే కాలువను బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి గోదావరి జలాలను కాలువ ద్వారా చెరువులకు తరలించిందన్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో చెరువుల్లో నీటి నిల్వలు కనిష్ట స్థాయికి చేరుకున్నాయన్నారు. సాగు చేసిన వరి పొలాలు ఎండిపోకుండా ప్రభుత్వం గతంలో మాదిరిగా తపాస్‌పల్లి రిజర్వాయర్ డీ 4 కెనాల్ నుంచి గోదావరి జలాలు చెరువుల్లోకి వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే అక్కడక్కడ దెబ్బతిన్న కాలువ మరమ్మతులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రైతులు సున్నం భాస్కర్, గూడెపు భూపతిరెడ్డి, చెంది మల్లికార్జున్, యాదగిరి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తనికెళ్ల భరణి తదితరులు

గజ్వేల్‌రూరల్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని సినీ నటుడు తనికెళ్ల భరణి అన్నారు. గజ్వేల్‌కు చెందిన లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ గుడాల రాధాకృష్ణ ఆధ్వర్యంలో రీజియన్ క్లబ్స్ నిర్వహించిన కార్యక్రమ చిత్రాల పోస్టర్‌ను హైదరాబాద్‌లో బుధవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గజ్వేల్ లయన్స్ క్లబ్ సభ్యులు చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. మున్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజియన్ సెక్రటరీ సంజయ్‌గుప్త, లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ స్నేహ అధ్యక్షుడు నేతి శ్రీనివాస్, రచయిత విశ్వేశ్వర్‌రావు, ప్రతినిధులు శంకర్, నారాయణ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణాలకు దీటుగా పల్లెల అభివృద్ధి



మాల కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): పట్టణాలకు దీటుగా పల్లెలను అభివృద్ధిలో తీర్చిదిద్దుతానని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం అక్బర్‌పేట- భూంపల్లి మండల పరిధిలోని కూడవెల్లిలో నూతన పంచాయతీ, అక్బర్‌పేటలో పీహెచ్‌సీ సబ్‌సెంటర్, మోతెలో మాల కమ్యూనిటీ హాల్‌తో పాటు పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, ఎంపీపీ గజ్జెల సాయిలు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బొంపెల్లి మనోహర్, సోలిపేట సతీష్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు కాలేరు శ్రీనివాస్, సుగుణ, స్వరూప, ఉపసర్పంచ్ మానస, నాయకులు సూకూరి లింగం, వల్లాల సత్యనారాయణ, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

బస్‌డిపో ఏర్పాటు కలేనా?



రామాయంపేట బస్ డిపో నిర్మాణానికి కేటాయించిన స్థలం

రామాయంపేట(మెదక్): పట్టణంలో 27 ఏళ్ల క్రితం స్థలం మంజూరైన బస్‌డిపో ఏర్పాటు కలగానే మిగిలింది. స్థానికంగా విలువైన స్థలాన్ని ఆర్టీసీ పేరిట గతంలో రిజిస్ట్రేషన్ చేయించి ఇవ్వగా, తెలుగుదేశం హయాంలో డిపో మంజూరైంది. కాగా అప్పుడు రవాణా శాఖ మంత్రిగా ఉన్న కేసీఆర్ డిపో స్థలాన్ని సందర్శించారు. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు డిపో స్థలాన్ని పరిశీలించి, త్వరగా పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఏళ్లు గడుస్తున్నా.. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకొని డిపో మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

గజ్వేల్‌రూరల్: శ్రీరామకోటి భక్తసమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీ విజేతలకు బుధవారం బహుమతుల పంపిణీ చేపట్టారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా శ్రీరామకోటి భక్తసమాజం ఆధ్వర్యంలో తాలుకా స్థాయిలో నిర్వహించిన ముగ్గుల పోటీలో 436 మంది మహిళలు పాల్గొనగా ఇందులో గెలుపొందిన పలువురికి పట్టణంలోని మురళీకృష్ణాలయంలో బహుమతులు పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి మాట్లాడుతూ.. సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు చాటిచెబుతూ ధార్మిక కార్యక్రమాలు చేపడుతున్న రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు సేవలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర బాధ్యులు డాక్టర్ ఆకుల నరేష్‌బాబు, దేవాలయ కమిటీ సభ్యులు రామచంద్రం, మైత్రాములు, లక్ష్మయ్య, మధు, నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఉదారత



ఉపాధ్యాయురాలితో పూర్వ విద్యార్థులు

సిద్దిపేటఅర్బన్: తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందించి సిద్దిపేట నేతాజీ పబ్లిక్ స్కూల్ పూర్వ విద్యార్థులు ఉదారత చాటుకున్నారు. పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న సునీత కుమారుడు బ్లడ్ కేన్సర్‌తో బాధ పడుతున్నాడు. ప్రస్తుతం అతడు హైదరాబాద్‌లోని బసవతారకం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తమకు ఆర్థిక సహాయం అందించాలని సామాజిక మాధ్యమాల్లో పెట్టిన పోస్టులను చూసిన పాఠశాల పూర్వ విద్యార్థులు స్పందించి సుమారు రూ. 67 వేల ఆర్థిక సహాయం బుధవారం పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయురాలికి అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సింగోజి జనార్దన్, రంగదాంపల్లి శ్రీను, వంగ శ్రీనివాస్‌రెడ్డి, రాధాకృష్ణ, కర్ణాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ కేంద్ర పథకాలపై అవగాహన



జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్‌లో బుధవారం బ్యాంకు అధికారులు, వైద్య సిబ్బంది వికసిత్ భారత్ సంకల్ప కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కృష్ణమూర్తి, ఉపేందర్‌రెడ్డి, రాములు, మల్లేశం, పర్వతాలు, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

◆ పంచాయతీ భవనం ప్రారంభం



మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని ధర్మారంలో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాన్ని సర్పంచ్ ఊట్ల రవీందర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ భవన నిర్మాణం పూర్తయి అందుబాటులోకి రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జయకార్, పంచాయతీ కార్యదర్శి అశోక్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

◆ పరామర్శ

బెజ్జంకి(సిద్దిపేట): ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బెజ్జంకి బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రేవతిని బుధవారం ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి పరామర్శించారు. ప్రమాదంలో రేవతి తల్లి కమలమ్మ మృతిచెందగా, ఆమె భర్తకు గాయాలయ్యాయి. కార్యక్రమంలో టీఎస్‌ఎంఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

◆ ముగిసిన రథోత్సవం

తూప్రాన్: మండల పరిధిలోని ఇస్లాంపూర్ గ్రామ సమీపంలోని రామలింగేశ్వర ఆలయంలో సంక్రాంతి పండుగ సందర్భంగా మూడు రోజులుగా జాతర కొనసాగింది. బుధవారం ముగింపులో భాగంగా ఉదయం స్వామివారి ఆలయం చుట్టు రథోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.